



సత్యం, శివం, సుందరం అన్న పద త్రయంలో సత్యానికే ఎక్కువ ప్రధాన్యత నిస్తాడు జగదీశ్. సత్యస్వరూపమే శివమనీ, ఎక్కడ సత్యముంటో అక్కడ సౌందర్య ముందనీ. కనుక శివ సౌందర్యాలు రెండూ సత్యానికి రూపాంతరాలు మాత్రమేనని అతని వాదన.

అంతటి తీవ్రమైన సత్యవాది కనుకనే బంధువిరోధే కాక మిత్రవిరోధి కూడా అయేడు జగదీశ్.

అతని విగ్రహంలో నిశితంగా చూసే అతని కళ్ళల్లో ఒక చిత్రమైన ఆకర్షణ ఉంది. అందుకే అతనితో కొద్దిపాటి పరిచయం ఉన్నవాళ్ళు అతని చుట్టూ చేరతారు. కాని ఆ పరిచయం కొంచెం పెరిగి పెద్దదవగానే అతను పలికే పచ్చి నిజాలకు, జీవితంమీద, మనుష్యులమీద అతను విసిరే ఘాటువిమర్శకు హడలిపోయి మళ్ళీ అతని ఛాయలకుకూడా పోయేవారు కాదు.

అతని అంతరంగాన్ని పూర్తిగా అర్థం చేసికొని ఆతనితో స్నేహం చేసిన కొద్దిమందిలో మొదటివాడు విశ్వం. ఆతని స్వభావం జగదీశ్ స్వభావానికి పూర్తి విరుద్ధం. జగదీశ్ ఎంత కరకుగా మాట్లాడుతాడో. విశ్వం అంత శాంతంగా, సరళంగా మాట్లాడ తాడు. జగదీశ్ కళ్ళు ఎంత తీక్షణంగా ఉంటాయో విశ్వం చూపులు అంత చల్లగా ఉంటాయ్.

వారిరువురి స్నేహం అందరికీ విడ్డూరంగా ఉండేది. అలాటివారికి విశ్వం చిరునవ్వుతో యిచ్చే సమాధానం యిది : "జగదీశ్ పైకి ఎంత భీకరంగా కనిపిస్తాడో అతని మనసు అంత మెత్తనిది. నేను పైకి ఎంతో నెమ్మదిగా కన పడినా నా భావాలు విప్లవపూరిత మైనవి. అందుకే మా యిరువురి స్నేహం అంత ప్రగాఢమైనది."

జగదీశ్ వైఖరి చూసి బంధుజన ములో ఎవరూ అతనికి పిల్లనివ్వ టానికి సాహసించేవాళ్ళు కాదు. తల్లి దండ్రులు ఎంతో శ్రమపడి తెచ్చిన దూరపు సంబంధాలను చూడకుండానే తిరస్కరించేవాడు జగదీశ్. చివరకు వాళ్ళు విసుగెత్తి అతనిమానాన అతన్ని వదిలేయటంవలన ముప్ఫయిసంవత్సరా లొచ్చినా ఆతను బ్రహ్మచారిగానే ఉండి పోయేడు.

ఆఖరుకు విశ్వంకూడా రెండుమూడు సంబంధాలు తెచ్చి స్నేహితుడిని మెప్పించలేక పోయేడు.

ఒకసారి విశ్వానికి పట్టరాని కోపం వచ్చింది జగదీశ్ ధోరణికి. "ఆ అమ్మాయి ఎంతో అందంగా ఉంది. నువ్వా అమ్మాయి కాలి గోటికికూడా పనికిరావు. ఆలా టమ్మాయి నీకు ఎందుకు నచ్చలేదో నా కర్థం కావటం లేదు," అన్నాడు.

"అందం జంతువుల్లోకూడా ఉంటుం దోయ్. వివాహానికి సౌందర్యం ప్రాతి పదిక కానేరదు," అన్నాడు జగదీశ్.

"పోనీ అందం సంగతి తీసెయ్. ఆమె బి. ఏ. ప్యాసయింది. ఆమెను గురించి యింకా తెలుసుకోవాలంటే ఆమెతో మాట్లాడటానికికూడా అవకాశం కల్పిస్తాను."

"చదువుకున్న అమ్మాయని చెప్పే స్తున్నావుగా. ఇంక చూడ నవసరం లేదు."

"అంటే ?" ఆశ్చర్యంగా అడిగాడు విశ్వం.

"ఈ రోజుల్లో చదువుకున్న ఆడ పిల్లలంతా ఒకే రకంగా ఉంటున్నా రోయ్—వేషభాషల్లోనూ, మనస్తత్వంలో కూడా. ఒక స్త్రీని చూస్తే మరొక స్త్రీని చూడనక్కరలేదు. అసలు ఆధునిక సభ్యతలో ఉన్న పెద్ద లోపమే అది. సృష్టిలోని వైవిధ్యాన్ని చంపేస్తుంది నాగరికత. చూడు, అలా సుల్తాన్ బజార్ లో విన్చుంటే అక్కడ కనపడే

అమ్మాయిలంతా ఒకే మూసలో పోసిన ట్లుంటారు. అందరిపీ ఒకే రకంగా కత్తిరించిన పొట్టిచేతుల జాకెట్లు, చెవులకు రింగులు, ఒకే పద్ధతిలో కట్టిన వాయిల్ చీరలు — ఆఖరికి బస్సుస్టాపులో పుస్తకాలు పట్టుకుని వాళ్ళు నిలబడే భంగిమకూడా ఒకే తీరులో ఉంటుంది. ప్రతి అమ్మాయి కళ్ళలో నూ ఒకే భావం — తా నెంతో అందంగా వున్నాననీ, రోడ్డుమీద అందరి చూపులూ తన మీదే వున్నా యనీను. వైవిధ్యంలేని యీ చదువుకున్న ఆడపిల్లల్ని చూసి చూసీ మొహం మొత్తుతోంది;" కాలిన సిగరెట్ అవతలకు విసిరేస్తూ అన్నాడు జగదీశ్.

"అయితే ఇంకేం, చదువూ సంధ్యా లేని ఓ అమ్మమ్మని చేసికోరాదూ. అలాటి ఆడవాళ్ళు ఈనాటికీ లక్షల కొలదీ వున్నారు యీ భారతదేశంలో," అన్నాడు విశ్వం.

అతని కోపాన్ని చూసి నవ్వేడు జగదీశ్.

"అమ్మమ్మల ప్రశ్న కాదోయ్. భార్య అనే స్త్రీ, పురుషుడిలో ఒక రకమైన ఆధ్యాత్మిక ప్రేరణ కలిగించాలి. మాస్క్యులైన్ చైన్ ఉన్న స్త్రీకి అది సాధ్య మవుతుందని నా ఉద్దేశ్యము. కాని అలాటి స్త్రీని నే నింతవరకు చూడలేదు," అన్నాడు.

అలా జగదీశ్ తన మనసు విప్పి చెప్పేసరికి విశ్వం మరిక మాట్లాడ లేకపోయేడు


ఒకరోజు మధ్యాహ్నం జగదీశ్‌ఆఫీసుకు ఫోను చేసేడు విశ్వం. ఆ రోజు సాయంత్రం ఆరు గంటల ట్రైన్‌కి తన మరదలు అచల వస్తోందనీ, తనకు ఆఫీసు వర్కు ఎక్కువగా ఉండటం వలన తను రాత్రి యింటికి వచ్చేసరికి పదవుతుందనీ, కనుక అతను స్టేషనుకు వెళ్ళి ఆమెని రిసీవ్ చేసుకోవలసిందని చెప్పేడు.

అయిష్టంగానే అంగీకారం తెలిపి ఫోన్ పెట్టేశాడు జగదీశ్. సాయంత్రం ఆరుగంటలకు నాంపల్లి స్టేషనులో ప్లాట్‌ఫారంమీద నిల్చుని అప్పుడే ఆగిన ట్రైనులోనుండి దిగుతున్న అమ్మాయిలందరినీ చూస్తూ నిల్చున్నాడు జగదీశ్.

రెండు నిముషాల తరువాత సాదా దుస్తుల్లో ఉండి తన పెద్ద కళ్ళను మరింత పెద్దవిచేసి ప్లాట్‌ఫారంమంతా కలియజూస్తున్న ఒక యువతిపైన అతని దృష్టిపడింది. వెంటనే ఆమె వద్దకు వెళ్ళి, "క్షమించండి. విశ్వేశ్వ రావుగా రింటికి వచ్చేది మీరేనా ?" అనడిగాడు.

"అవును. మా బావ స్టేషన్‌కు రాలేదే? మీరు . . . ."

"నేను విశ్వం స్నేహితుడిని. తనకి ఆఫీసుపని ఉందని నన్ను స్టేషనుకు పంపేడు," అంటూ పేరు చెప్పకుండానే



పల్లెటూరివాడు : "ఏందయ్యోయ్! ఎంత తెలియనోణ్ణిఅయితేమాత్రం యింత మోసం చేస్తావటయ్యా! కళ్లెదుటే చిల్లిపడిన రికార్డులు యిస్తావుటయ్యా!?"

---

తనని తాను నిర్లక్ష్యంగా పరిచయం చేసుకున్నాడు జగదీశ్.

ఆమె మౌనంగా అతనివెంట నడచి స్టేషనుబయటకు వచ్చింది — కనీసం మర్యాదకోసమయినా తనచేతిలోని సూట్‌కేసుని అందుకోని ఆ యువకుని వింత ప్రవర్తనకు లోలోపల విస్తుపోతూ.

టాక్సీ పిలిచేడు జగదీశ్. వెనకసీట్లో కూర్చున్న అచల అతనికోసం ఒక పక్కగా స్థలం వదిలినా కూర్చోక వెంటనే డోర్ వేసివెళ్ళి డ్రైవర్‌పక్కనే కూర్చోవటం చూసి అది అతిమర్యాదో, నిర్లక్ష్యమో తెలియక తికమకపడింది అచల. 'చూస్తుంటే ఏదో ముడుపు చెల్లించుకున్నట్లు వచ్చేడు తప్ప, స్టేషనుకు రావటం యితని కిష్టం లేనట్టుందే,' అనుకుంది.

దారిలో వారిద్దరిమధ్యా ఎలాటి సంభాషణా జరగలేదు.

విశ్వం యింటిముందు టాక్సీ ఆగగానే అచల దిగింది. జగదీశ్ టాక్సీ లోపలే కూర్చుని "ఇదేయిల్లు, లోపలికి వెళ్ళండి. మీ అక్కయ్యగారితో నాకంత పరిచయంలేదు. ఇక నేను వెళ్తాను," అని డ్రైవర్‌తో "హిమాయత్ .నగర్ పోనియ్," అన్నాడు.

థాంక్సుకూడా చెప్పడం మర్చిపోయి, దూసుకుపోయిన టాక్సీవైపే వింతగా చూస్తూ నిల్చుండిపోయింది అచల.

మర్నాడు ఆదివారం అవటంవలన విశ్వం జగదీశ్‌ని తమయింటికి తీసుకు వెళ్ళేడు. వాళ్ళిద్దరూ వెళ్ళేసరికి డ్రాయింగ్ రూములో కూర్చుని ఏదో పుస్తకం చదువుతున్న అచల వెంటనే లేచి లోపలికి వెళ్ళిపోయింది.

"పెద్ద తెలివిగలవాడినని విర్రవీగుతావుకదా. అచలనుచూసి ఏం చదుకుందో చెప్పుకో చూద్దాం" అన్నాడు నవ్వుతూ విశ్వం.

"హెచ్చెస్సీనో, లేదా P. U. C; A. B. F." అన్నాడు జగదీశ్.

"అదేమిటి? పియుసీ తరువాత అదేం డిగ్రీ? నే నెప్పుడూ వినలేదు;" ఆశ్చర్యపోయేడు విశ్వం.

ఎబిఫ్ అంటే appeared but failed అని అర్థంలే."

"ఓ! అదా," అంటూ గట్టిగా నవ్వేడు విశ్వం. "ఐతే పప్పులో కాలేశావ్‌వోయ్! ఆమె ఎంయే లిటరేచర్. ఆంధ్రా యూనివర్శిటీ గోల్డ్ మెడలిస్టు," అన్నాడు.

మొదట ఆశ్చర్యపోయినా వెంటనే "ఆ ముఖం చూస్తే లిటరేచర్ లక్షణా లేవీ కనపడటంలేదే! గోల్డుమెడలిస్టంటున్నావు కాబట్టి 'రుబ్బురో' లయి ఉంటుందె," అన్నాడు తన పెడసరి ధోరణిలో.


"చదువులోనే కాదోయ్; సహజంగానే చురుకైన బ్రెయిన్ మా అచలది," అన్నాడు మెచ్చుకోలుగా విశ్వం.

"ఆడదానికి బ్రెయినేమిటోయ్. 'పెన్తు వంద రాఫ్ ది వారల్డ్' లా."

నవ్వేడు జగదీశ్.

విశ్వానికి కోపంవచ్చినా తమాయించుకున్నాడు. "అచలను అందరు స్త్రీలతో పోల్చకు జగదీశ్! ఆమె నిజంగా మేధావే. ఈనాడు పేరుపొందిన రచయిత్రులలో అచలకూడా ఒకతి," అన్నాడు.

"ఆఁ, ఈరోజుల్లో కాస్త అక్షరజ్ఞానం ఉన్న ప్రతిస్త్రీకూడా ఏ బీరకాయ పప్పునుగురించో, వంకాయ కూరను గురించో వ్రాసి రచయిత్రి ననిపించుకుంటూనేఉంది. అదీకాక యీ రోజుల్లో స్త్రీరైటర్స్ ఎక్కువగా కనిపిస్తున్నారంటే దానికి చాలా కారణా లున్నయ్. అందులో ఒకటేమిటంటే పురుషుడికంటె స్త్రీలలో సెంటిమెంటు ప్రెషర్ అనేది నిర్వివాదాంశం. అవిద్యావంతురాలైన స్త్రీ జిహ్వాచాపల్యంకొద్దీ తిని సొపింతా పొరుగమ్మకు వెళ్ళబోసుకున్నట్టు, అక్షరజ్ఞానం కల యీనాటి స్త్రీ కలంద్వారా తన క(వ్య)థలను లోకానికి వెళ్ళబోసుకుంటుంది. ఎంత చదువుకుంటే నేం, 'కూపస్థమండూకం' సామెతలా యీ ఆడవాళ్ళ ఆలోచనల పరిధులు ఎప్పుడూ సంకుచితంగానే ఉంటయ్. లోకాన్ని గురించీ, జీవితాన్ని గురించీ మన భారత



స్త్రీలకు ఏమాత్రం తెలుసంటావ్? తమ చుట్టూ ఉన్నదే ప్రపంచ మనీ, తాము అనుభవిస్తున్నదే జీవితమనీ భ్రమించి సువిశాలమూ, అనంతమూ అయిన యీ జీవితానికి అర్థం పర్థం లేని నిర్వచనాలు చేస్తున్నారు. ఆధునిక రచయిత్రులు. అసంఖ్యాకంగా వెలువడుతున్న యీ స్త్రీల రచనలను నిశితంగా పరిశీలిస్తే వారు స్వవిషయాన్ని గూర్చి చెప్పిన ఆ అభిప్రాయాలు వన్‌సైడెడ్‌గా, ప్రెజుడీషియల్‌గా ఉంటున్నయ్ తప్ప వాటిలో ఏమాత్రం అనుభవం సమదృష్టి ఉండటం లేదు. దానికితోడు చాలమంది ఎడిటర్లు కూడా డబ్బు బాగా వస్తుందనో, లేక స్త్రీలను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతోనో కాని స్త్రీల రచనలనే ఎక్కువగా ప్రచురిస్తున్నారు." అంటూ ఒక చిన్న ఉపన్యాసం యిచ్చేడు జగదీశ్.

"ఐతే ఉత్తమరచనలంటే ఏమిటి మీ ఉద్దేశ్యంలో? అలాటి రచనలను పురుషులు తప్ప స్త్రీలు చెయ్యలేరనా మీ అభిప్రాయం?"

గుమ్మంలో నిల్చుని అచల వేసిన ప్రశ్నకు అంతవరకు ఆమెను గమనించని స్నేహితు లిద్దరూ ఉలికిపడ్డారు.

ఎదురుచూడని ఆమె ప్రశ్నకు మొదట కలవరపడ్డా, వెంటనే సర్దుకుని నవ్వేశాడు జగదీశ్. "నేను రచయితను కాను. విమర్శకునికూడా కాను. నేను సామాన్య పాఠకుడిని మాత్రమే. కాబట్టి రచనలలో ఏదిఉత్తమం. ఏదికాదన్నసంగతి చెప్పే అర్హత నాకులేదు." అన్నాడు తప్పించుకుంటూ.

"అర్హతల ప్రసక్తి లేదిక్కడ. మీ అభిప్రాయంగురించి అడుగుతున్నానంతే." నంది అచల అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంటూ.

అదే మరోస్త్రీ అయితే ఏదోఒకటి చెప్పి తప్పించుకునేవాడు జగదీశ్. కాని అచల ముఖంలోని వర్చస్సును, తన వంక తదేకంగా చూస్తున్న ఆమె కళ్ళలోని పట్టుదలను చూసి, అతనికి సమాధానం చెప్పలేక తప్పలేదు. "ఏ రచనలోనైనా మొదట వాస్తవికత ఉండాలనేది నిర్వివాదాంశం; అలాగని ఉన్నదున్నట్లు వర్ణిస్తూ పాఠకులకు 'బోర్' కొట్టటం ఉత్తమరచయిత లక్షణంకాదు. రచనలో వాస్తవికతకు తోడు చక్కని శైలి, చివరివరకు పాఠకుడిచేత పట్టు విడవకుండా చదివించగల ఒక రకమైన 'ఊపు' ఉండాలి. ఒకరచన చదివిన తరువాత పాఠకుడు తన ఆలోచనా ప్రపంచంలో ఒక కొత్తద్వారం తెరవబడినట్లూ, జీవితగమ్యానికి తనకు తెలిసిన బాటలో ప్రగతి మార్గానికి తీసుకుపోయే ఒక కొత్తతోవను తను కనుక్కున్నట్లూ ఫీలయితే అది ఉత్తమ రచనే అవుతుంది," అన్నాడు.

పైకి అలా అన్నాడే కాని యింకా తను చెప్పదలుచుకున్నదేదో చెప్పనేలేదన్నట్లు ఫీలయ్యాడు జీవితంలో మొదటిసారిగా జగదీశ్.

"అలాటి రచనలు నేటి రచయిత్రులు చెయ్యటం లేదనా మీ అభిప్రాయం ?"

"—అని కాదనుకోండి. వారి రచనల్లో అనుభవం, విశ్వజనీనత తక్కువంటున్నాను."

అచల ఏదో అనబోతుండగా యిక యీ వాదన ఎక్కడ తీవ్రరూపం దాలుస్తుందోనన్న భయంతో విశ్వం, "కాస్త లోపలికి వెళ్ళి మంచినీళ్లు తీసుకురామ్మా అచలా !" అని అలా "కోటీవరకు వెళ్ళొద్దాంటోయ్; పనుండి," అన్నాడు జగదీశ్‌తో.

అచల రెండు గ్లాసులతో మంచినీళ్లు తెచ్చింది.

ఇద్దరూ తాగి బయటకు వెళ్ళిపోయేరు.

ఆ తరువాత విశ్వం తరచు జగదీశ్‌ని తమ యింటికి తీసుకువెళ్ళటం, అచల, జగదీశ్‌లు ఏదో ఒక విషయమై వాదప్రతివాదాలు చేసుకోవటం, వాదన మరీ విషమస్థితికి వచ్చే ట్లున్నప్పుడు ఏదో రకంగా విశ్వం టాపిక్ మార్చేయటం జరుగుతుండేది.




అచల యింకా పదిరోజులకు వెళ్ళిపోతుం దనగా ఓ సాయంత్రం జగదీశ్ వెళ్ళేసరికి అచల ఒక్కతే ఉంది. ఆమె చేతిలో శరత్ వ్రాసిన 'దేవదాసు' నవల ఉంది.

అతనిని చూడగానే ఆమె పుస్తకం టేబులుమీద పడేసి "రండి, కూర్చోండి. అక్కవాళ్ళు సినిమాకు వెళ్ళేరు." అంది.

అప్పటికి వారి పరిచయం ఎక్కువగానే ఉండటంవలన బెట్టు చెయ్యకుండా

కూర్చుని జగదీశ్ ఆమె వుంచిన పుస్తకం తీసుకుని తిరగవేయసాగేడు.

ఒక్క నిమిషం ఆగి, "దేవదాసు పాత్రపై మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు తలెత్తి ఆమెవంక చూస్తూ.

"చాలామంది అతనో గొప్ప ప్రేమికుడంటూ ఆకాశాని కెత్తేస్తారు. కాని నా దృష్టిలో వట్టి వంచకుడూ, ఆత్మద్రోహీ."

"ఎందుచేత?"

"చిన్నతనంలో ఆటపాటలతో తనతో కలిసిపెరిగిన పార్వతిని పట్నం చదువుకు వెళ్ళేసరికి మర్చిపోతాడు... ఇంటికి తిరిగి వచ్చేసరికి పాతస్మృతులు అతనిలో సజీవంగా ఉన్న ప్రేమను మేల్కొలుపుతాయి. కాని పార్వతే తనంతట తాను వచ్చి ప్రేమభిక్ష నర్థించే సరికి పురుషాహంకారంతో ఆమెను తిరస్కరిస్తాడు. అంతేకాక తనెన్నడూ ఆమెనలాటి దృష్టితో చూడలేదని బొంకి ఆత్మవంచన చేసుకుంటాడు. కాని మరల పార్వతి తనకు దూరం కావటంతో అతని అహంకారం తునాతునకలై పోతుంది. ఇక ఏమాత్రం ఆత్మవంచన చేసుకోలేని దేవదాసు తన మనఃక్షోభను మరచిపోయే ఉద్దేశ్యంతో, తాగుడు మొదలెడ్తాడు. నిత్యం ప్రపంచంలో మనకు కనబడే వేలాది బలహీనులు, ఆత్మవంచకులు అయిన యువకుల ప్రతినిధి దేవదాసు; అంతకంటే ఏ గొప్పతనం అతనిలో లేదు."

"ప్రేమ అనే పదం అసలున్నదంటారా? ప్రేమంటే ఏమిటి మీ ఉద్దేశ్యంలో?"

కొద్ది క్షణాలు మౌనంగా ఉండి సమాధాన మిచ్చింది అచల. "సున్నితమైన హృదయంలో ఒక వ్యక్తిచేత ప్రేరేపించబడిన స్పందనమే ప్రేమ అని నా ఉద్దేశ్యం."

ఆమె సమాధానం విని ఆదోరకంగా నవ్వాడు జగదీశ్. అత నలా నిర్లక్ష్యంగా నవ్వినందుకు ఆమె ముఖం చిన్నబుచ్చుకుంది. ఆమె అభిమానం తీవ్రంగా గాయపడింది.

"ఏం, ప్రేమమీద మీకు విశ్వాసం లేదా?" అనడిగింది.

"మిధ్యను విశ్వసించలేను నేను."

"అంటే?"

"ప్రేమ అనేది కేవలం మన భ్రమ మాత్రమే. మానసిక దౌర్బల్యం కల యువతీ యువకులను ఆశ్రయించే ఒక రకం జబ్బు యిది."

అచల మాట్లాడలేదు. ఓసారి అతని వంక చూసి వెంటనే చూపు మరల్చుకుంది. ఇద్దరూ ఐదునిముషాలపాటు ఏం మాట్లాడుకోకుండా కూర్చుండిపోయారు. అప్పుడే లేచి వెళ్ళిపోయేడు జగదీశ్.

వారం రోజుల తరువాత ఓ చల్లని సాయంత్రం టాంకుబండ్ మీద నడుస్తూ విశ్వం జగదీశ్‌తో "అచలనుగురించి నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగేడు.

"చదువుకున్నది, తెలివైనది, బుద్ధిమంతురాలు," అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"ఆమెని పెళ్ళాడే పురుషుడు అదృష్టవంతుడే నంటావా?"

"తప్పకుండా."

"ఐతే ఆ అదృష్టవంతుడివి నువ్వే ఎందుకు కాకూడదూ?"

ఓ కారు రివ్వున దూసుకుపోయింది వాళ్ళ పక్కగా.

"ఏమిటి నువ్వనేది?" నమ్మలేనట్లు అడిగేడు జగదీశ్.

"అచలను పెళ్ళిచేసుకోవటం నీకిష్టమేనా?" సూటిగా ప్రశ్నించేడు విశ్వం.

"నన్ను చేసుకోవటం ఆమె కిష్టమో కాదో ముందామె నడగవలసింది నువ్వు."

"నువ్వు ఒప్పుకుంటే ఈ రాత్రికే ఆమె నడుగుతాను. ఆమె కాదనదని నా విశ్వాసం."

"ఆలోచించి చెప్తాను."

"నెమ్మదిగా ఆలోచించుకునే చెప్పు. ఆదివారమే అచల వెళ్ళిపోతుంది. ఈ రెండురోజుల్లో ఏ నిర్ణయానికి వచ్చిందీ చెప్పెయ్యాలి." ఆరాత్రి జగదీశ్‌కి నిద్ర పట్టలేదు. అచలనుగురించే ఆలోచిస్తున్నాడతను. ఈ మధ్య కొన్ని దినాలుగా ఆతని మనసు ఆతని స్వాధీనంలో లేకుండా అచలవైపుకు పరుగెత్తుతోంది తనలో కలుగుతున్న యీ మానసిక వికారాన్ని అంతా ప్రేమ అని అంటారనీ, అందరిలా యీ దౌర్బల్యానికి తాను లొంగిపోకూడదనీ నిశ్చయించుకున్నాడు.

మర్నాడు శనివారం సెలవు పెట్టాడు ఆఫీసుకి. విశ్వం కంటబడకుండా ఆ సాయంత్రం ఆదివార మంతాకూడా పిచ్చిగా రోడ్లమ్మటి తిరిగాడు.

అహంకారానికీ, ప్రేమకూ మధ్య సంఘర్షణ బయలుదేరిం దతనిలో. అచలతో తను ప్రేమనుగురించి జరిపిన సంభాషణ జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా అతనికి అభిమానం ముంచుకువచ్చేది. తనలాటి పురుషుడు అచలలాటి స్త్రీముందు అలా మాట్లాడిన తరువాత ఆ ప్రేమకే దాసోహం అవటం ఏమంత గౌరవప్రదమైన విషయం కాదనుకున్నాడు. కాని మరుక్షణంలోనే అహాని కతీతమైన ఏదో శక్తి అతనిని అచలవైపుకు లాక్కుపోయేది. అహాన్ని విస్మరించిన ఆ క్షణంలో రెండు హృదయాలు పరస్పరం పెనవైచుకున్న ఆ మధుర క్షణాల్లో అత నో అలౌకికానందాన్ని అనుభవించేవాడు.

ఇలా ద్వంద్వ భావాలతో గడుపుతూండగానే సాయంత్రం నాలుగయింది. అచల వెళ్ళే ట్రైన్ ఏడుగంటలకే — అంటే మూడు గంటల్లోగా తను ఏదో ఒక నిర్ణయానికి రావాలి.

అలా ఆలోచిస్తూనే మరోగంట గడిచింది. కుర్చీలో కూర్చున్న జగదీశ్‌ని ఏదో నిస్సత్తువ ఆవరించింది. ఆరోజు తన జీవితంలో ఒక నూతనాధ్యాయం

ప్రారంభ మవబోతోందని అతని అంత రాత్మ తెలుపుతోంది.

అతని మనసు ఏదో చెయ్యమని ప్రోత్సహిస్తోంది. కాని అతని శరీరం పక్షవాతం వచ్చినట్లుగా నిశ్చేష్టమై పోయింది.

ఐదున్నరయింది. ఛెళ్ళున ఎవరో కొరడాతో కొట్టినట్లు లేచేడు జగదీశ్. పాంటూ, షర్టూ వేసుకుని విశ్వం యింటికి బయలుదేరేడు.

విశ్వం, అతనిభార్యా అచలను స్టేషనుకు పంపటానికి సిద్ధంగా ఉన్నారు బట్టలవీ వేసుకుని.

వెళ్ళగానే "అచల యేది?" అనడిగేడు.

ఒకసారి అతనివంక చూసి మరో ప్రశ్న వేయకుండా "ఆ గదిలో ఉంది," అంటూ వేలుపెట్టి చూపించేడు విశ్వం.

గదిలోకి వెళ్ళేడు జగదీశ్.

అచల సూటుకేసులోకి బట్టలు సర్దుకుంటోంది. తల వంచుకుని తెల్లని వలువలు ధరించిన ఆ విరాడంబర సుందరిని చూస్తూనే అతని హృదయంలో ప్రేమ వరదలై ప్రవహించసాగింది.

"అచలా!" అని పిలిచేడు. ఆ పిలుపులో యుగయుగాలనాటి మానవుని మధురప్రేమ ప్రతిధ్వనించింది.

ఆ కంఠస్వరం విని విచలితయై తలెత్తి చూసింది అచల. మరుక్షణమే తలదించుకుని బట్టలు సర్దుకోసాగింది.

ఆమెకు కోపం వచ్చిందని గ్రహించి నవ్వుకున్నాడు. "అచలా! నే నెందుకు వచ్చేనో తెలుసా? నీ దగ్గర ప్రేమభిక్ష నర్థించటానికే వచ్చేను. నేనూ సామాన్యమైన మానవుడినే అచలా! ఇది దౌర్బల్యమే కావచ్చు — ఈ ప్రేమభావానికి నే నతీతుడిని కాలేను. నీతో పరిచయమైన దగ్గరనుండి నాలో కలుగుతున్న మానసిక ఘర్షణ ఆ ఒక్క అంతర్యామికే తెలుసు. ప్రేమే జయించింది—నేను ఓడిపోయాను అచలా! ఓడిపోయాను."

ఒకసారి అతనివంక చూసి నిర్లిప్తంగా నవ్వింది అచల. "కాని నా మనసుతో జరిగిన పోరాటంలో నేనే గెలిచాను జగదీశ్‌బాబూ! మీ వ్యక్తిత్వానికి తలవంచిన నా హృదయాన్ని లొంగదీసుకోవటానికి శాయశక్తులా ప్రయత్నించి, చివరకు కృతకృత్యురాలి నైనాను," అన్నది.

"అలా అనకు అచలా! నా ప్రవర్తనతో ని న్నెన్నోసార్లు గాయపరిచాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నట్లు తెలిసే, అవకాశం లంభించినప్పుడల్లా నిన్ను బాధించేను. అందుకు ఎలాటి శిక్షయినా విధించు; కాని నన్ను మాత్రం తిరస్కరించకు," అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"లాభంలేదు జగదీశ్. మన యిద్దరి కలయికా అసంభవం. ఒకవేళ మన పెళ్ళికి ఇప్పుడు నే నంగీకరించినా, మన భావిజీవితం సుఖవంతంగా ఉంటుందన్న నమ్మకం నాకులేదు."

"ఎందుచేత?"

"మన యిరువురివీ ఒకే రకమైన



ప్రవృత్తులు. దంపతులంటే ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు పూర్తిచేసేట్లుగా ఉండాలి తప్ప ఒకేరకమైన మనస్తత్వం గల భార్యాభర్తల్లో ఘర్షణ తప్పదు. మనం భార్యాభర్తలకన్న స్నేహితులుగా ఉన్నపుడే ఒకరినొకరు గౌరవించుకుని అర్థం చేసికోగలం. వివాహబంధాన్ని తగిలించుకుని మనిద్దరిమధ్య ఉన్న ఈ పరస్పర గౌరవాభిమానాలను మలినపరచవద్దు," అని, బట్టలు సర్దటం ముగించి, లేని నిల్చుంది అచల.

జగదీశ్ స్తబ్ధుగా నిల్చుండిపోయాడు.

అచల తిరస్కారం అతనిలోని అహాన్ని తీవ్రంగా గాయపరచింది. జీవితంలో మొదటిసారిగా శత్రువుచేతిలో ఓడిపోయిన వీరుడిలా నిలబడ్డాడతను.

అతని ముఖంవంక చూడగానే ఆమె హృదయం ఒక్కసారిగా ద్రవించినట్లయింది. కాని మరుక్షణమే మనసుని రాయి చేసుకుని "ప్రేమదేవత ముందు ఓడిపోయానని పశ్చాత్తాపపడుతున్నారా? జయాపజయాలు మన చేతుల్లో లేవు. విచారించకండి," అంటూ వెళ్ళిపోయింది అచల.